గిరిజన యూనివర్సిటీ సాధిస్తా

ఆదిలాబాద్‌పై కేంద్రం చిన్నచూపు • యూనివర్సిటీని ఇచ్చినట్టే ఇచ్చి మోసం

ఉపాధ్యాయుడిగా ఉన్నప్పుడే ఉద్యమాలు • కాంగ్రెస్‌ను గెలిపించి బాధపడుతున్నరు

బీజేపీ దేశానికి శ్రేయస్కరం కాదు • 'నమస్తే' ఇంటర్వ్యూలో ఆత్రం సక్కు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోనే అత్యధిక గిరిజన జనాభా కలిగిన ఆదిలాబాద్‌పై కేంద్రం చిన్నచూపు చూస్తున్నదని బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు విమర్శించారు. గతంలో ట్రైబల్ యూనివర్సిటీ ఇచ్చినట్టే ఇచ్చి వేరే ప్రాంతానికి తరలించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తనను గెలిపిస్తే ఆదిలాబాద్‌కు గిరిజన యూనివర్సిటీ తీసుకురావడంతోపాటు ఆదిలాబాద్ నుంచి ఆర్మూరు వరకు రైల్వేలైన్, రెబ్బనలో ఓవర్ బ్రిడ్జి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. గురువారం ఆయన 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఎంపీ ఎన్నికల ప్రచారం ఎలా సాగుతున్నది?

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్నాం. పోలింగ్ బూత్‌లవారీగా కమిటీలు పూర్తిస్థాయిలో ప్రచారం చేస్తున్నాయి. కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నాం. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రచారం చేస్తున్నాం. కార్యకర్తలు, నాయకులు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విజయం సాధించి తీరుతాం.

బరిలో ఉన్న ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులు గోండు తెగకు చెందిన వారే. ప్రజలు మీవైపే ఉంటారని ఎలా భావిస్తున్నారు?

నేను ఉద్యమం నుంచి వచ్చిన వాడిని. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సమయంలోనే ఆదివాసీల కోసం ఉద్యమాలు చేశా. వారి ప్రోత్సాహంతోనే రాజకీయాల్లోకి వచ్చా. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందా. ఇప్పుడు ఎంపీ అభ్యర్థిగా ఉద్యమ పార్టీ అయిన బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్నా. ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఆదివాసుల సమస్యలు తెలియవు. నావైపే ఆదిలాబాద్ ప్రజలు, ఆదివాసీలు ఉన్నారని నమ్ముతున్నా. వారు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నా.

రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ అంటోంది. దీనిపై మీరేమంటారు?

ప్రపంచ మేధావి అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఎస్సీఎస్టీలకే కాదు, బీసీ, ఇతర అణగారిన వర్గాలకు రక్షణ కవచం వంటిది. ఇలాంటి రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ ప్రకటించడడం దేశానికి శ్రేయస్కరం కాదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కులను కాలరాసేందుకే బీజేపీ ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నది. రాజ్యాంగాన్ని మారిస్తే ఎవరూ ఊరుకోరు.

ఎస్సీ వర్గీకరణ, ఎస్టీ రిజర్వేషన్లపై కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానాలు చేసింది. కేంద్రం వాటిని పక్కన పెట్టింది. దీనిపై మీ స్పందన ఏమిటి?

కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణ, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసింది. వాటిని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తొక్కిపెట్టింది. కేంద్రం మెడలు వంచైనా వాటిని సాధించేందుకు కృషి చేస్తా.

కాంగ్రెస్, బీజేపీ తమతోనే అభివృద్ధి సాధ్యం అంటున్నాయి. దీనిపై మీ కామెంట్?

జాతీయ పార్టీలకు వాటి ప్రయోజనం తప్ప అభివృద్ధి పట్టదు. వారికి కావాల్సిన నాయకులు ఉన్న ప్రాంతాలను మాత్రమే పట్టించుకుంటారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధిపై ఏ జాతీయ పార్టీకీ చిత్తశుద్ధి లేదు. ప్రాంతీయ పార్టీలతోనే మారుమూల ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుంది.

ఎన్నికల ప్రచారంలో ప్రజల స్పందన ఎలా ఉంది?

బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపించి తప్పు చేశామని బాధపడుతున్నారు. ఉద్యమాల నేపథ్యం నుంచి వచ్చిన నాకు కేసీఆర్ ఎంపీగా అవకాశం కల్పించడంపై ఆదివాసీలతోపాటు, జిల్లా ప్రజలు కూడా సంతోషంగా ఉన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఓట్లు వేస్తామని ప్రజలే బాహాటంగా ప్రకటించడం సంతోషంగా ఉంది. కార్యకర్తలు, పార్టీ నాయకులు అందరు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారు. స్వచ్ఛందంగా ప్రచారం చేస్తున్నారు.

స్పందించని రేవంత్

మొదటిపేజీ తరువాయి...

ప్రకారం శుక్రవారం ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్దకు రాజీనామా పత్రంతో హరీశ్‌రావు వచ్చారు. రాజీనామా లేఖను బహిరంగంగా అందరికీ చూపించారు. ఉద్యమ జర్నలిస్టులకు దానిని అందజేశారు. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం అక్కడికి రాలేదు. దీంతో హరీశ్ సవాల్‌ను స్వీకరిస్తున్నానని రేవంత్‌రెడ్డి చేసినవన్నీ ఉత్తి ప్రగల్భాలేనని తేలిపోయిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. హరీశ్‌రావుకు పదవులకు రాజీనామా చేయడం కొత్తేమీ కాదని గుర్తు చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల కోసం అనేకసార్లు పదవులకు రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శించారని, రాష్ట్ర రైతుల ప్రయోజనం కోసం రాజీనామాకు సిద్ధం అయ్యారని చెప్తున్నారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డికి మాత్రం ఇప్పటివరకు రాజీనామా చేసిన చరిత్ర లేదని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా అదే తరహా రాజకీయం చేస్తున్నారని చెప్తున్నారు.

మీకిస్తే.. మాకేంటి?

మొదటిపేజీ తరువాయి...

పూర్తిగా వేయలేదు.

- రాష్ట్రంలో ఉద్యోగులు... ఉపాధ్యాయులకు సంబంధించిన జీతాల బకాయిలు, ఇన్సూరెన్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితరాలకు సంబంధించిన బిల్లులు నాలుగైదు నెలలుగా పెండింగులోనే ఉన్నాయి. ఎస్టీవో టోకెన్స్ వచ్చినప్పటికీ ఖజానా నుంచి బిల్లులు రాకపోవడంతో వారంతా చెప్పులరిగేలా తిరుగుతున్నారు.
- రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్లకు మూడు నెలలుగా జీతభత్యాలు, ఆశ వర్కర్లకు నాలుగు నెలలుగా టీఏ, డీఏలు రాలేదు. ఇలాంటి చిరుద్యోగులకు నెలల తరబడి జీతాలు పెండింగులో ఉండటంతో ఆ కుటుంబాలు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నాయి. గురుకులాల్లో పని చేసే ఐసీటీ కంప్యూటర్ టీచర్లకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని ఇటీవల మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం ఎక్స్ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.

పాత బిల్లులకు క్లియరెన్స్!

ఒకవైపు గత నాలుగు నెలల ఆర్థిక శాఖ లెక్కలేమో ప్రభుత్వ ఆదాయాన్ని ఘనంగానే చూపుతున్నా.. అన్నదాతకు రైతుబంధు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతులెందుకు రావడం లేదు? ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలను సైతం అరిగోస ఎందుకు పెడుతున్నారు? ప్రభుత్వానికి సమకూరుతున్న ఆదాయం ఎక్కడికి పోతున్నది? ఆర్థిక శాఖలో అసలు ఏం జరుగుతున్నదని పెద్ద చర్చనీయాంశంగా మారింది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలోనూ బెంగళూరు తరహా కమీషన్ల దందా విశృంఖలంగా కొనసాగుతున్నదా? అన్న చర్చ సాగుతున్నది. అధికారిక, రాజకీయవర్గాల నుంచి అందుతున్న విశ్వసనీయ సమాచారం మేరకు ఖజానా నుంచి నిధులు పక్కదారి పడుతున్నాయని, బ్యాక్‌డోర్‌లో పర్సంటేజీల పందేరంతో సర్కారు ఆదాయం పాత బిల్లుల క్లియరెన్స్‌కు మళ్లిపోతున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ఎన్నికల వ్యయానికి నిధులను సమీకరించడంలో నిమగ్నమైన పెద్దలు 20 శాతం కమీషన్‌తో పాత బిల్లులకు మోక్షం కలిగిస్తున్నట్టు అధికార, రాజకీయవర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా ఒక సన్నిహితుడు 'స్వామి కార్యం... స్వకార్యం' అన్నట్టు 10–11 శాతంతో పాత బిల్లులకు మోక్షం కలిగిస్తూ 'సింహ' భాగం దండుకుంటున్నారని చెప్పుకొంటున్నారు. పార్టీ ముఖ్యులంతా ఎన్నికల బిజీలో ఉన్న తరుణంలో సందట్లో సడేమియాగా సదరు వ్యక్తి ఉదయం లేచింది మొదలు పెండింగు బిల్లుల క్లియరెన్స్‌తోనే యమ బిజీగా ఉన్నట్టు సెక్రటేరియట్ అధికారికవర్గాల్లో చర్చ సాగుతున్నది.

చక్రం తిప్పుతున్న సన్నిహితుడు

కర్ణాటకలో గతంలోని బీజేపీ సర్కారుపై 40 శాతం కమీషన్ అంటూ ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన అక్కడి కాంగ్రెస్.. తెలంగాణ ఎన్నికల సమయంలో ఆ రాష్ట్రంలో అదే తరహా దందాను కొనసాగించినట్టు అప్పట్లోనే బయటపడింది. తెలంగాణలో ఎన్నికల వ్యయం కోసం కర్ణాటక కాంగ్రెస్.. బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్టు ఆ రాష్ట్ర బీజేపీ నాయకులు బహిరంగంగా ఆరోపణలు చేశారు. అంతేకాదు.. బెంగళూరులో జరిగిన ఐటీ అధికారుల దాడుల్లో ఓ కార్పొరేటర్ ఇంట్లో భారీ ఎత్తున నగదు కూడా బయటపడింది. పార్లమెంటు ఎన్నికల వ్యయాన్ని సమకూర్చుకునేందుకుగాను పెద్దలు పెద్ద ఎత్తున పాత బిల్లుల క్లియరెన్స్‌కు తెరలేపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యుల ఆదేశంతోనే అధికారులు పాత దస్త్రాలను దులిపి మరీ వాటికి మోక్షం కల్పిస్తున్నట్టు చర్చ సాగుతున్నది. ఒక్కోసారి పార్టీ ఫండ్‌గా ఏకంగా 20 శాతందాకా కమీషన్ సమర్పించాల్సి వస్తున్నదని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు కీలక నేతకు సన్నిహితుడైన ఒక వ్యక్తి ఆర్థిక శాఖలో చక్రం తిప్పుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఆయనకు 10–11 శాతం కమీషన్ సమర్పించుకుంటే గంటల వ్యవధిలోనే కోట్ల రూపాయల పెండింగు బిల్లులకు మోక్షం కలుగుతున్నట్టు కాంట్రాక్టర్లు చెప్పుకుంటున్నారు. అడిగినంత సమర్పించుకుంటే తప్ప తనకు సంబంధించిన 56 కోట్ల బిల్లులు క్లియర్ కాలేదని ఒక కాంట్రాక్టర్ వాపోయారు.

దిక్కుతోచని స్థితిలో సమర్పయామి

వాస్తవానికి ఇంత భారీ మొత్తంలో కమీషన్లు భారమే. నెలల తరబడి కోట్లాది రూపాయల బిల్లులు పెండింగులో ఉండటంతో అప్పులు, బ్యాంకు రుణాలు తెచ్చి పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు వడ్డీల భారం పెరిగిపోతున్నది. దీంతో కాంట్రాక్టర్లు 10–20 శాతం కమీషన్లకు సైతం ముందుకొస్తున్నారు. గతంలో భూములపై పెట్టుబడులు పెట్టగా రాష్ట్రంలో రియల్ రంగం కుదేలవడంతో బడా కాంట్రాక్టర్లు దిక్కుతోచని పరిస్థితుల్లో పడిపోయారు. రియల్‌కు పూర్వ వైభవం వచ్చేదెప్పుడో.. అనే ఆందోళనతో అప్పులు ఇచ్చిన వాళ్ల ఒత్తిడి తట్టుకోలేక అలాంటి కాంట్రాక్టర్లు కమీషన్లు ఇచ్చేందుకు కూడా వెనుకాడటం లేదు. మరోవైపు పార్లమెంటు ఎన్నికల తర్వాత రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయనే దానిపై భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. రాజకీయ అనిశ్చితి నెలకొంటే పెండింగ్ బిల్లుల పరిస్థితి అటకెక్కే ప్రమాదముందని భయపడుతున్నారు. అందుకే కమీషన్ సమర్పించుకోవడమో, పవర్ సెంటర్‌ను ప్రసన్నం చేసుకోవడమో చేస్తున్నారు.

పట్టుబడిన గంజాయిని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గుమ్మల్లబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్ వద్ద దహనం చేస్తున్న ఎస్పీ చందనా దీప్తి

5.10 కోట్ల విలువైన గంజాయికి నిప్పు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 26 : నల్లగొండ జిల్లావ్యాప్తంగా పట్టుబడిన రూ.5.10 కోట్ల విలువైన 2,043 కిలోల గంజాయికి పోలీసులు నిప్పు పెట్టారు. పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 39 కేసుల్లో దీన్ని స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు దాన్ని శుక్రవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గుమ్మల్లబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్ వద్ద ఎస్పీ, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కాల్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ.. గంజాయిని రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బెర్లిన్‌లో జర్మనీ సంస్థ ప్రతినిధులతో వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు

సౌర విద్యుత్తులోకి సిరిసిల్ల 'సెస్'

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ)/ వేములవాడ: సిరిసిల్ల సహకార విద్యుత్తు సంస్థ సోలార్ పవర్‌లోకి ప్రవేశించి మరో రికార్డు సృష్టించబోతున్నది. 1969లో జిల్లాలోని 13 మండలాల్లోని అన్ని గ్రామాలకు ఒకేసారి వంద శాతం విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చిన ఏకైక సహకార విద్యుత్తు సంస్థగా చరిత్ర పుటల్లోకి ఎక్కిన విషయం తెల్సిందే. తాజాగా సెస్‌ను సొంతంగా సౌర విద్యుదుత్పత్తిలోకి తీసుకొచ్చేందుకు వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం జర్మనీ సంస్థ ప్రతినిధులతో తరచూ సమావేశమవుతున్నారు. అందులో భాగంగా గత నెల 27న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదరాబాద్‌లో కలిసి చర్చలు జరిపారు. సోలార్ విద్యుత్తు ఉత్పత్తితో పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంతోపాటు సెస్ ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు పడే అవకాశం ఉన్నది. ఇందుకోసం అధికారులు సమగ్ర నివేదికలు రూపొందిస్తున్నారు. ఆగస్టు నెలలో హైదరాబాద్‌కు రానున్న జర్మనీ బృందంతో సెస్, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపనున్నారు.

కోడ్ ఉల్లంఘన కేసులు 6,366

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు భారీగా నమోదవుతున్నాయి. మార్చి మొదటి వారం నుంచి ఏప్రిల్ 26 వరకు మొత్తం 6,366 కోడ్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. వీటిల్లో గరిష్ఠంగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కేసులు 5,967 నమోదయ్యాయి. నార్కోటిక్/డ్రగ్స్ కేసులు 104, ఐపీసీ కేసులు 274, ప్రజాప్రాతినిధ్య చట్టం కేసులు 21 ఉన్నాయి.

కాళేశ్వరంపై ఫిర్యాదుల స్వీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై వ్యక్తులు, సంస్థల నుంచి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ప్రత్యేకంగా పలు బాక్సులను బీఆర్కే భవన్‌లోని న్యాయ విచారణ కమిషన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. తొలి రోజున ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఇరిగేషన్ శాఖ అధికారులు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలు, డిజైన్లు, మేడిగడ్డ బరాజ్ కుంగుబాటు, నిధుల వినియోగం తదితర అంశాలపై జస్టిస్ పినాకినిఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్‌ను ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. కమిషన్ చైర్మన్ జస్టిస్ ఘోష్ ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నారు. విచారణ ప్రక్రియను ప్రారంభించారు. ఫిర్యాదులు, సలహాలు, సూచనలను స్వీకరించేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక బాక్సులు ఏర్పాటు చేశారు. శనివారం మూడు బరాజ్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించనున్నట్టు కమిషన్ తెలిపింది.

నేటి నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ దరఖాస్తులు

- **మే 7 వరకు తుది గడువు, మే 26న పరీక్ష**
- **జేఈఈ మెయిన్ సిలబస్ తగ్గింపు**
- **అడ్వాన్స్‌డ్‌కు యథాతథం**

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : ప్రతిష్ఠాత్మక ఐఐటీ ల్లో బీటెక్, ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ –2024కు దరఖాస్తు నమోదు శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభంకానున్నది. ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను ఐఐటీ మద్రాస్ నిర్వహించనున్నది. అభ్యర్థులు మే 7 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకొనేందుకు గడువు ఉన్నది. ఫీజు మాత్రం మే 10 సాయంత్రం 5 గంటల వరకు చెల్లించొచ్చు. జేఈఈ మెయిన్ ర్యాంకులు గురువారం విడుదలైన విషయం తెలిసిందే. జేఈఈ మెయిన్‌కు హాజరైన వారిలో నుంచి 2. 5 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. క్యాటగిరీ వారీగా కటాఫ్ ర్యాంకులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విడుదల చేసింది. వీరంతా జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

రెండింటికీ హాజరుకావాల్సిందే..

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో భాగంగా నిర్వహించే రెండు పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలి. ఈ పరీక్షను మే 26న నిర్వహిస్తారు. రెండు పరీక్షలు రాసిన అభ్యర్థుల ఫలితాలను మాత్రమే ప్రకటిస్తారు. ఇదిలావుండగా, ఈ సారి జేఈఈ మెయిన్ సిలబస్‌ను కాస్త తగ్గించారు. కానీ, అడ్వాన్స్‌డ్‌లో మాత్రం యథాతథంగా పాత సిలబస్‌నే కొనసాగించారు. దీంతో అభ్యర్థులు ఆయా పాఠ్యాంశాలన్నీ చదవాల్సి ఉంటుంది.

ఏసీబీకి రూ.4లక్షలతో పట్టుబడిన డీఈ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): భవన నిర్మాణానికి ఎన్‌వోసీ ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బుద్ధభవన్‌లోని నార్త్ ట్యాంక్ డివిజన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా యాత పవన్‌కుమార్ పనిచేస్తున్నారు. ఉప్పల్ భగాయత్ ప్రాంతంలోని శాంతినగర్‌లో కమర్షియల్ భవనం నిర్మించేందుకు రామంతాపూర్‌కు చెందిన ఓ బిల్డర్ నిరభ్యంతరపత్రం (ఎన్‌వోసీ) కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీని కోసం డీఈ రూ.5 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ మేరకు శుక్రవారం మొదటగా రూ.4లక్షలను బుద్ధభవన్‌లోని కార్యాలయంలో తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని నాంపల్లిలోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు పనుల కోసం డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని సూచించారు.

శుక్రవారం సూర్యాపేటలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

రైతుల ధర్నా

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 26 : ఎన్నిమార్లు విన్నవించినా తమ సమస్యలు పరిష్కరించడం లేదని హమాలీలు శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో కాంటాలను నిలిపివేసి సమ్మెకు దిగారు. ఇదే సమయంలో కాంటాలు వేయాలని కోరుతూ రైతులు జాతీయ రహదారిపై ధర్నా చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆర్డీవో వేణు మాధవరావు, మార్కెట్ కార్యదర్శి రాహుల్ హమాలీలతో మాట్లాడి శనివారం ఉదయం వరకు కాంటాలు వేయిస్తామని చెప్పడంతో రైతులు వెనుదిరిగారు. మార్కెట్‌లో వినియోగిస్తున్న సూపర్ బస్తాలతో వేసవికాలంలో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్టు హమాలీలు వాపోయారు. తక్షణమే గన్నీ బస్తాలు పెట్టాలని, తమ లైసెన్స్‌లు రెన్యూవల్ చేయాలని, ఖరీదుదారులే బస్తాలు, పురుకోసలు తెచ్చివ్వాలని డిమాండ్ చేశారు.

• ట్రాన్స్‌ఫర్మేటివ్ సర్జరీతో మధుమేహం దూరం

బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్‌లో ముగ్గురికి ఉపశమనం

బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్ పరీక్ వెల్లడి

బంజారాహిల్స్, ఏప్రిల్ 26: ఊబకాయం వల్ల మధుమేహ సమస్యలతో బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులకు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్ వైద్యులు పూర్తి ఉపశమనం కల్పించారు. ట్రాన్స్‌ఫర్మేటివ్ సర్జరీతో వారిని మళ్లీ సాధారణ స్థితికి చేర్చారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాకు చెందిన వినీత్‌కుమార్ బన్సల్ (35), వినయ్‌కుమార్ బన్సల్ (35), మదన్‌చందర్ బారిక్ (45) ఊబకాయం వల్ల గత పదేండ్ల నుంచి మధుమేహం, రక్తపోటు, నిద్రలేమి, మోకాళ్ల నొప్పులు తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఈ ముగ్గురు కేర్ హాస్పిటల్‌లో బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్ పరీక్‌ను సంప్రదించడంతో విజయవంతంగా ట్రాన్స్‌ఫర్మేటివ్ సర్జరీని పూర్తిచేశారు. ల్యాప్రోస్కోపిక్ విధానంలో నిర్వహించిన ఈ శస్త్రచికిత్స తర్వాత వారి ఊబకాయంతోపాటు ఇతర సమస్యలన్నీ తగ్గుముఖం పట్టాయని డాక్టర్ పరీక్ వెల్లడించారు.

• కొత్తగా 1500 ఆర్టీసీ బస్సులు

కొనుగోలుకు టీఎస్ఆర్టీసీ నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించినప్పటి నుంచి ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. కొన్ని సందర్భాల్లో సీట్ల కోసం కొట్లాటలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీఆఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకొన్నది. 1500 ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వీలైనంత మేరకు అద్దె ప్రాతిపదికన ఎలక్ట్రిక్ బస్సుల్ని ఆర్టీసీ తీసుకొంటున్నది. ఇప్పుడున్న పాత బస్సుల స్థానంలో కొత్తవి కొనేందుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బ్యాంకు రుణం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

జూలై కల్లా 450 ఎలక్ట్రిక్ బస్సులు

ఇక పెద్ద సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఇప్పుడు దాదాపు 105 ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతుండగా.. మరో వెయ్యి పైచిలుకు రోడ్డెక్కించేందుకు ఆర్టీసీ ప్రయత్నాలు చేస్తున్నది. ఇందులో జూలై కల్లా 450 అందుబాటులోకి వస్తాయని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. కొత్తగా వచ్చే ఎలక్ట్రిక్ బస్సులను నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు.. అదేవిధంగా జిల్లాల్లో ఇతర ప్రాంతాలకు నడిపించేలా ఆర్టీసీ కార్యాచరణకు సిద్ధమవుతున్నది.

• టెట్‌కు మాక్‌టెస్టులు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మాక్‌టెస్టులను పాఠశాల విద్యాశాఖ అందుబాటులోకి తెచ్చింది. టెట్‌కు హాజరయ్యేందుకు ఈ ఏడాది 2.86 లక్షల దరఖాస్తులొచ్చాయి. ఇదివరకు ఓఎమ్మార్ పద్ధతిలో టెట్ నిర్వహించగా, ఈ ఏడాది తొలిసారిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) మే 20 నుంచి జూన్ 3 వరకు నిర్వహిస్తారు. https://tstet2024.aptonline.in/tstet/ వెబ్‌సైట్ ద్వారా మాక్‌టెస్టులకు హాజరై, ప్రాక్టీస్ చేసుకోవచ్చు.

• యూపీఎస్సీ ప్రిపరేషన్‌పై సెమినార్

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : యూపీఎస్సీ సివిల్స్ పరీక్షపై విజన్ ఐఏఎస్ అకాడమీలో శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో ఆలిండియా 36వ ర్యాంకు సాధించిన ఆయుషి ప్రధాన్, 50వ ర్యాంకు సాధించిన కేఎన్ చందన జాహ్నవిలచే 'టాపర్స్‌టాక్' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రిపరేషన్‌పై అభ్యర్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

• సీబీఐటీలో హ్యాక్‌ఎక్సిలరేట్ -2024

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : ప్రముఖ ఎడ్యుటెక్ సంస్థ బై టెక్సల్ శుక్రవారం చైతన్యభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కాలజీలో జాతీయ స్థాయి హ్యాకథాన్ నిర్వహించింది. మైక్రోసాఫ్ట్ సహకారంతో హ్యాక్‌ఎక్సిలరేట్ –2024 పేరిట నిర్వహించిన ఈ హ్యాకథాన్‌లో ఐఐటీ ఢిల్లీ సహా పలు విద్యాసంస్థలకు చెందిన 139 బృందాలు పాల్గొన్నాయి. హ్యాకథాన్‌లో విజేతలకు రూ. 2.75లక్షల నగదు బహుమతులు అందజేస